క్లుప్తంగా

వైభవంగా దానవాయిబాబు ఉత్సవాలు



స్వామివారిని దర్శించుకున్న రుడా చైర్‌పర్సన్ షర్మిలారెడ్డి

సీటీఆర్‌ఐ: దానవాయిపేటలో కొలువైన దానవాయిబాబు ఉత్సవాలను ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామివారిని రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (రుడా) చైర్ పర్సన్ షర్మిలారెడ్డి దర్శించుకున్నారు. ఆమె మాట్లాడుతూ అందరూ కలిసి ఈ ఉత్సవాలను చేయడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో పళ్ల వెంకటేశ్వరరావు, అంబులెన్స్ చిన్ని, నక్క చిట్టిబాబు, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు పార్థసారథి పాల్గొన్నారు. నారాయణపురంలోని కోటసత్తెమ్మ తల్లి ఆషాఢమాస పూజల సందర్భంగా ఆదివారం అమ్మవారికి కుంకుమ పూజ నిర్వహించారు.

వైద్యశిబిరం



వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ కృష్ణతేజ

కడియం: బుర్రిలంకలోని ఎంపీయూపీ స్కూల్లో చిరు సేవాసమితి అధ్యక్షుడు గెద్దం శివగణపతి ఆధ్వర్యంలో ఆదివారం రాజమహేంద్రవరం కందుల న్యూరోకేర్ హాస్పిటల్ నేతృత్వంలో వైద్యశిబిరం నిర్వహించారు. న్యూరోఫిజీషియన్ డాక్టర్ కందుల కృష్ణతేజ మెదడు, వెన్నెముక, నరాల సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైనవారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. బీపీ, షుగరు పరీక్షలు చేశారు.

పర్యావరణ పరిరక్షణకు సమష్టి కృషి



క్లాత్ సంచులు పంపిణీ చేస్తున్న మానవత ప్రతినిధులు

రాజమహేంద్రవరం సిటీ: పర్యావరణ పరిరక్షణకు సమష్టి కృషి చేయాలని మానవత సేవాసంస్థ సభ్యుడు వెత్సా (మెహర్)మధు పిలుపునిచ్చారు. స్థానిక గణేష్‌చౌక్‌లోని రైతుబజార్‌లో కూరగాయలు కొనుగోలు చేసిన వారికి ఆయన ఆదివారం క్లాత్ సంచులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణతో పాటు మానవత సేవాసంస్థను ప్రచారం చేసే కార్యక్రమంలో భాగంగా ఈ క్లాత్ సంచుల పంపిణీ చేపట్టామన్నారు. ఇప్పటి వరకూ వ్యక్తిగతంగా సుమారు 75 వేల సంచులు పంపిణీ చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో కంచర్ల నాగేంద్రుడు, మాటూరి చిరంజీవి, గ్రంధి ప్రసాద్, బూరగడ్డ మురళీ, పెదమల్లు రామకృష్ణ, చిటికెన వెంకట రమణ, సత్యం రావు, పాల కృష్ణ ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

వ్యాధులపై గ్రామీణులకు అవగాహన



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ వెంకట్రాజు

రంగంపేట: గ్రామీణ ప్రాంతాల ప్రజలకు వ్యాధులపై అవగాహన కల్పించాలని రాజమహేంద్రవరం రాజు న్యూరో మల్టీస్పెషాలిటీ హాస్పటల్ అధినేత డాక్టర్ బి.వెంకట్రాజు అన్నారు. ఆదివారం సింగంపల్లి గ్రామంలో రాజు న్యూరో మల్టీస్పెషాలిటీ హాస్పటల్ ఆధ్వర్యంలో రంగంపేట మండల గ్రామీణ వైద్యులకు నరాలు, జీర్ణ వ్యవస్థ, గుండె వ్యాధులకు సంబంధించిన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో డాక్టర్ వెంకట్రాజు మాట్లాడుతూ గ్రామీణ వైద్యులే ప్రజలకు వ్యాధులపై అవగాహన కల్పించాలన్నారు. బీపీ, షుగర్ తదితర వ్యాధులు రాకుండా వ్యాయామం చేయాలని సూచించాలని వివరించారు. డాక్టర్ రఘువీర్ జీర్ణ వ్యవస్థకు సంబంధించిన విషయాలను, డాక్టర్ వినోద్‌కుమార్ గుండెకు సంబంధించిన విషయాలపై వివరించారు.

పేకాట శిబిరంపై దాడి

బిక్కవోలు: మండలంలోని రంగాపురంలో జరుగుతున్న పేకాట శిబిరంపై దాడి చేసి, ఆరుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై పి.బుజ్జిబాబు తెలిపారు. కానేటి దుర్గయ్య, గుర్రాల శ్రీను, ఇజ్జిన బంగారు బాబ్జీ, గుర్రాల ప్రసాద్, కానేటి దుర్గాప్రసాద్, ధనకొండ దుర్గయ్యను అరెస్టు చేసి, వారి నుంచి రూ.4,730 స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే రంగాపురంలో అక్రమంగా మద్యం కలిగిన పలివెల దుర్గ ప్రసాద్‌ను అరెస్టు చేసి, రూ.3,100 విలువైన మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

ఆంధ్రకేసరి పార్కుకు మహర్దశ

- రూ.1.80 కోట్లతో అభివృద్ధి పనులు
- సందర్శకులకు సకల సౌకర్యాలు



పనులు పూర్తయిన తర్వాత ఆంధ్రకేసరి పార్కు (డిజిటల్ చిత్రం)



ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులు

రాజమహేంద్రవరం సిటీ: చారిత్రక నగరంలో పార్కులను సుందరంగా అభివృద్ధి చేసేందుకు నగరపాలకసంస్థ సిద్ధమైంది. హ్యాపీస్ట్రీట్ ఏర్పాటు చేసిన పరమహంస యోగానంద మార్గ్‌లో మరో సుందర ప్రదేశం నగర ప్రజలకు అందుబాటులోకి రానుంది. ఇప్పటికే ఆంధ్రకేసరి కళాశాలను ఆనుకుని ఉన్న రోడ్డును ప్రతి ఆదివారం హ్యాపీస్ట్రీట్ పేరుతో ఆటవిడుపుగా ఉండేలా ప్రత్యేక కార్యక్రమాలతో సిద్ధం చేశారు. తాజాగా ఈ వీధిని ఆనుకుని ఉన్న ఆంధ్రకేసరి పార్క్‌ను రూ.1.80 కోట్లతో అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక రూపొందించారు.

పచ్చదనం పోకుండా..

ప్రస్తుతం పార్కులోని చెట్లను తొలగించకుండా, పచ్చదనం పోకుండా వాకింగ్ ట్రాక్, గ్రీనరీ, కూర్చోవడానికి వివిధ రకాల బెంచీలు ఏర్పాటు చేయనున్నారు. టంగుటూరి ప్రకాశం విగ్రహాన్ని కూడా ప్రతిష్ఠించనున్నారు. ఆ ప్రాంతంలోని వాకర్లు, వెల్ఫేర్ అసోసియేషన్‌తో చర్చించి వారి సలహాలు, సూచనలు తీసుకుని పార్కు అభివృద్ధి పనులు ప్రారంభించారు. ఇవి పూర్తయిన తర్వాత హ్యాపీస్ట్రీట్‌ను అనుసంధానం చేసి ప్రతి ఆదివారం కార్యక్రమాలు నిర్వహించేందుకు అధికారులు ప్రయత్నం చేస్తున్నారు.

ఆహ్లాదంతో ఆనందం

ప్రస్తుతం హ్యాపీస్ట్రీట్ నిర్వహించే ఆదివారం సాయంత్రం సమయంలో రోడ్డులో ఒక భాగాన్ని బ్లాక్ చేసి వినోద కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ పార్కు అభివృద్ధిలో స్టేజ్ నిర్మించేందుకు అధికారులు చర్యలు చేపట్టనున్నారు. దీని వల్ల రోడ్డును బ్లాక్ చేయాల్సిన పరిస్థితి ఉండదని అధికారులు చెబుతున్నారు. పార్కులో సందర్శకులకు ఆహ్లాదం, ఆనందం పంచడంతో పాటు తినుబండారాలు అందించేందుకు నాలుగు ఫుడ్ అవుట్ లెట్లు ఏర్పాటు చేయనున్నారు. పార్కులో రాత్రి సమయాల్లో అత్యాధునిక విద్యుత్ వెలుగులు విరజిమ్మేలా చర్యలు చేపడుతున్నారు.

రెండు నెలల్లో పూర్తి



రెండు నెలల్లో పనులు పూర్తిచేసి, ప్రజలకు పార్కును అందుబాటులోకి తీసుకువస్తాం. చిన్నారులు ఆటలాడుకునేందుకు ప్రత్యేక ఏర్పాటు చేస్తున్నాం. సందర్శకుల అవసరాలు తీర్చేందుకు నాలుగు ఫుడ్ అవుట్‌లెట్లు తదితర సదుపాయాలు కల్పిస్తున్నాం. వీటి నిర్వహణకు త్వరలో టెండర్లు పిలుస్తాం.

– జి.పాండురంగారావు, సూపరింటెండెంట్ ఇంజినీర్, నగర పాలక సంస్థ

జగన్ పాలనలో ముస్లింల సంక్షేమం



మహ్మద్ ఆరిఫ్, వక్ఫ్‌బోర్డ్ జిల్లా చైర్మన్

సీటీఆర్‌ఐ: మైనారిటీల సంక్షేమానికి చిత్తశుద్ధితో పనిచేస్తూ, వారి జీవన ప్రమాణాలు మెరుగుపరుస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ముస్లిం సమాజం ఎల్లప్పుడూ రుణపడి ఉంటుందని వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ మహ్మద్ ఆరిఫ్ అన్నారు. జాంపేటలోని తన కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడారు. ఆర్థికంగా అత్యంత బలహీనవర్గాలైన దూదేకుల, నూర్ బాషా, పింజరి, లాద్దాఫ్ వర్గాల ముస్లింలకు కల్యాణమస్తు పథకం కింద రూ.50 వేల లబ్ధి మాత్రమే చేకూరేదన్నారు. ఇస్లాం మతాన్ని ఆచరించే వీరు బీసీ– బీ కేటగిరీలో ఉండడం వల్ల ఆ మాత్రం సాయమే అందేదన్నారు. అయితే వీరందరికీ షాదీతోఫా ద్వారా రూ.లక్ష లబ్ధి చేకూర్చాలని ముఖ్యమంత్రి జగనన్న తీసుకున్న నిర్ణయంపై రాష్ట్రవ్యాప్తంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయన్నారు. అలాగే ప్రభుత్వం అందిస్తున్న ఇతర సంక్షేమ పథకాల్లో సైతం వీరిని ముస్లింలుగానే పరిగణించాలని ఆదేశించడం అభినందనీయమన్నారు.

సర్వీస్ రూల్స్ సమస్య పరిష్కారంపై హర్షం



సమావేశంలో మాట్లాడుతున్న టీవీఎస్ రంగారావు

ప్రకాశం నగర్: రెండు దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయ సర్వీస్ రూల్స్‌ను పరిష్కరించడంపై హర్షం వ్యక్తం చేస్తూ, ఉపాధ్యాయ సంఘం తరఫున ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ప్రభుత్వ ఉపాధ్యాయుల సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు టీవీఎస్ రంగారావు అన్నారు. ఈ మేరకు ఆదివారం స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సంఘం ఉమ్మడి జిల్లా సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. రంగారావు మాట్లాడుతూ గత ప్రభుత్వం 1988లో అనాలోచితంగా తీసుకువచ్చిన ప్రభుత్వ పంచాయతీరాజ్ ఉపాధ్యాయుల ఉమ్మడి సర్వీస్ రూల్స్ కారణంగా విద్యావ్యవస్థ కుంటుపడిందన్నారు. ప్రభుత్వం ఎంఈవో పోస్టులను సృష్టించి సమస్యకు సహేతుకమైన పరిష్కారం చూపించిందన్నారు. సమావేశంలో మాజీ అధ్యక్షుడు మురళీ సత్యనారాయణ, రాష్ట్ర కార్యదర్శి దుర్గా తులసీ దాస్, అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు మార్టిన్ లూథర్

కడియం: రాష్ట్రంలో కాంగ్రెస్‌కు పూర్వ వైభవం వస్తుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మార్టిన్ లూథర్, సమన్వయకర్త తాడాల కొండరాజు అన్నారు. బుర్రిలంకలోని నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యుడు తాడాల కొండరాజు ఇంటివద్ద ఆదివారం నియోజకవర్గం స్థాయి సమన్వయ కమిటీ సభ్యుల సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన మార్టిన్ లూథర్ మాట్లాడుతూ గ్రామాల్లో కాంగ్రెస్‌ను బలోపేతం చేసే దిశగా బూత్ లెవెల్ కమిటీల నియామకం జరుగుతోందన్నారు. తాడాల కొండరాజు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ప్రజలు రాహుల్‌గాంధీ నాయకత్వాన్ని కోరుకుంటున్నారన్నారు. సమావేశంలో మోత శారద, రొక్కళ్ల సుజాత, గుమ్మడి ఇందిర, పీఎస్ఎన్ రాజు, కాగిత వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఆహా ఏమి రుచి .. తినరా మైమరచి..

- రేషన్ బియ్యంతో పసందైన రుచులు
- రాజానగరంలో వంటల పోటీ
- 40 రకాల పదార్థాలతో సత్తా చాటిన మహిళలు



బహుమతులు అందిస్తున్న కమిషనర్ అరుణ్ కుమార్, కలెక్టర్ మాధవీలత, చిత్రంలో ఎమ్మెల్యే రాజా

రాజానగరం: ప్రజలకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న రేషన్ బియ్యంతో రకరకాల వంటలు తయారు చేసి, వాటిని స్టాళ్లలో ఏర్పాటు చేశారు. వాటి రుచి చూసిన అధికారులు, ప్రజాప్రతినిధులు అబ్బురపడ్డారు. వండుకుని తినేందుకు పనికిరావన్నట్టుగా కొందరు లబ్ధిదారులు రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టించేందుకు సిద్ధమవుతున్నారు. అటువంటి వారిలో అవగాహన తీసుకువచ్చి, రేషన్ బియ్యంలో ఉన్న విలువలను, నాణ్యతను తెలియజేసే విధంగా రాష్ట్రంలో మొదటిసారిగా రాజానగరంలో మండల స్థాయిలో ఈ పోటీలను ఆదివారం నిర్వహించారు. స్థానిక మండల ప్రజాపరిషత్ ఆవరణలో జరిగిన ఈ పోటీలలో పాల్గొన్న స్వయం సహాయక సంఘాలు, అంగన్‌వాడీ కేంద్రాలకు చెందిన మహిళలు 50 స్టాళ్లను ఏర్పాటు చేశారు. మునగాకు రైస్, కరివేపాకు రైస్, తాటి గారెలు, నువ్వుఅరిసెలు, మునగాకు ఉప్మా, పాలముంజులు, ఇలా.. సుమారు 40 రకాల వంటలను తయారు చేశారు. ఈ స్టాళ్లను రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ హెచ్.అరుణ్ కుమార్, కలెక్టర్ కె.మాధవీలత, జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్, ఆర్డీఓ చైత్రవర్షిణి, స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా తదితరులు సందర్శించారు. మహిళలు తయారు చేసిన వంటను రుచిని ఆస్వాదించారు.

అప్‌లోడ్ చేయించి, అవగాహన పెంచుదాం

ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని కోట్లాది రూపాయలు వెచ్చించి, రేషన్ కార్డుల ద్వారా సరఫరా చేస్తున్న ఫోర్టిఫైడ్ రైస్‌ని చులకనగా చూడవద్దని, దీనిలో ఎన్నో పోషకాలు ఉన్నాయంటూ మహిళలు తయారుచేసిన ఈ వంటలను ఫొటోలు, వీడియోలు తీయించారు. వాటిని వీటిని సోషల్ మీడియా, యూట్యూబ్, ఫేస్‌బుక్, ట్విట్టర్ వంటి వాటిలో అప్‌లోడ్ చేసి, ప్రజలకు, వలంటీర్లకు చేరువయ్యే విధంగా చర్యలు తీసుకుంటున్నామని కమిషనర్ అరుణ్ కుమార్ తెలిపారు.

విజేతలకు బహుమతులు

వంటల పోటీలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో విజేతలను ఎంపిక చేసి, రూ.10 వేలు, రూ.5 వేలు, రూ.2500 చొప్పున సర్టిఫికెట్లతో పాటు అందజేశారు. ప్రథమ బహుమతిని నందరాడకు చెందిన జి.వేణు, వెంకటరత్నం (కరివేపాకు రైస్), ద్వితీయ బహుమతిని జి.యర్రంపాలెంకు చెందిన కె.లక్ష్మి, దుర్గకు (తాటిగారెలు), మూడో బహుమతిని కలవచర్లకు చెందిన తవ్వా లక్ష్మి, ముద్దాడ లక్ష్మి, వై.సుజాత, ఎన్.వెంకటలక్ష్మి (రవ్వ, పులి హోర, పాలముంజెలు) గెలుచుకున్నా రు. పోటీలో పాల్గొన్న వారందరికీ ప్రోత్సాహకంగా రూ.వెయ్యి చొప్పున స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా సొంతంగాఅందజేశారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరంఆర్డీఓ ఎ.చైత్రవర్షిణి, డీఎస్ఓ ఇన్‌చార్జి విజయ భాస్కర్, మార్కెటింగ్ డీఎం ఎ.కుమార్,డీఆర్‌డీఏ పీడీ ఎ.సుభాషిణి, డీఎల్‌డీఓ పి.వీణాదేవి, తహసీల్దార్ పవన్ కుమార్, ఎంపీడీఓ బి.రామారావు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాలు ఉచితంగా అందించాలి

ప్రకాశం నగర్: ఇంటర్ విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు అందించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు గన్నిరాజు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక మావోభవన్‌లో పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన గన్నిరాజు మాట్లాడుతూ ప్రభుత్వం ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టులను భర్తీ చేయాలని, కార్పొరేట్ కళాశాలల ఫీజుల దోపిడీని అరికట్టాలన్నారు. సంఘం సహాయ కార్యదర్శి కిరణ్ కుమార్, కోశాధికారి భాను ప్రసాద్ పాల్గొన్నారు.

జీవో 117ను రద్దు చేయాలి

సీటీఆర్‌ఐ: 117 జీవోను రద్దు చేయాలంటూ రాజమహేంద్రవరంలో జరిగిన ప్రభుత్వ విద్యా పరిరక్షణ సదస్సు డిమాండ్ చేసింది. బీసీ, ఎస్సీ ఎస్టీ మైనారిటీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆనం రోటరీ హాలులో ఆదివారం ఈ సదస్సు నిర్వహించారు సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు సోనబోయిన రామారావు అధ్యక్షతన జరిగిన సదస్సులో పలు తీర్మానాలు చేసి ఏకగ్రీవంగా ఆమోదించారు. పేదలకు విద్యను అందించేందుకు 5వ తరగతి వరకు ప్రభుత్వమే కామన్ విద్యావిధానం ద్వారా పాఠశాలలను నిర్వహించాలని, పాఠశాల విద్యను అస్తవ్యస్తం చేస్తున్న 84, 85, 117 జీవోలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సదస్సు తీర్మానించింది. సదస్సుకు ఆంధ్రప్రదేశ్ విద్యా పరిరక్షణ సమితి కన్వీనర్ డి.రమేష్ పట్నాయక్ (గుంటూరు) ప్రధాన వక్తగా హాజరయ్యారు. ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, సీపీఐ నాయకుడు రాంబాబు, కాంగ్రెస్ నాయకుడు బాలేపల్లి మురళీధర్, బీసీ,ఎస్సీ,ఎస్టీ, మైనారిటీ సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు కేకే సంజీవరావు, వైస్ చైర్మన్ ఎల్‌వీ ప్రసాద్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా హ్యాపీ స్ట్రీట్

రాజమహేంద్రవరం సిటీ: స్థానిక పరమహంస యోగానంద మార్గ్‌లో నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హ్యాపీ స్ట్రీట్‌లో ఆదివారం సాయంత్రం సందడి నెలకొంది. చిన్నారులను నుంచి పెద్దల వరకూ ఆటపాటలతో ఉత్సాహంగా గడిపేందుకు తరలివచ్చారు. సాయంత్రం 6 నుంచి రాత్రి 9 గంటల వరకూ వివిధ కార్యక్రమాలు జరిగాయి.



నిస్వార్థ సేవలకు ప్రతిరూపం వలంటీర్లు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్షకు అనుగుణంగా వీరందరూ ప్రజలకు చిత్తశుద్ధితో సేవలు అందిస్తున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు అందడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. అలాగే ఏ కష్టం వచ్చినా ముందుకు వచ్చి సాయపడుతున్నారు.

– సీటీఆర్‌ఐ/రాజమహేంద్రవరం రూరల్



సత్తిబాబుకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ వరగ్రేస్

ఈయన పేరు వాసంశెట్టి సత్తిబాబు. 29వ డివిజన్‌లోని 15వ వార్డు సచివాలయం పరిధిలో ఉంటున్నారు. దివ్యాంగుడైన సత్తిబాబు ఆరోగ్యం సక్రమంగా ఉండడం లేదు. అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రతినెలా మాదిరిగానే ఈనెల ఒకటిన పింఛన్ వలంటీర్ వరగ్రేస్ ఆయన ఇంటికి వెళ్లింది. అక్కడ లేకపోవడంతో విషయం తెలుసుకుంది. వెంటనే ఆస్పత్రికి వెళ్లి ఆయనకు పింఛన్ అందించింది.

వలంటీర్ కుటుంబానికి అండగా..



సుమన్‌బాబు కుటుంబానికి నగదు అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శి, వలంటీర్లు (ఫైల్)

అనారోగ్యంతో మృతి చెందిన వలంటీర్ కుటుంబానికి సచివాలయ ఉద్యోగుల సహకారంతో వలంటీర్లు నగదు సహాయం అందించి దాతృత్వాన్ని చాటుకున్నారు. కొంతమూరు గ్రామసచివాలయం–1 వలంటీర్ నూకతట్టి సుమన్‌బాబు 2020 అక్టోబర్‌లో అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన కుటుంబానికి సాయం అందించాలని వలంటీర్లుసంకల్పించారు. తమతో పాటు సచివాలయ ఉద్యోగుల సహకారంతో రూ.20 వేలను అప్పటి పంచాయతీ కార్యదర్శి హనుమంతరావు చేతుల మీదుగా వలంటీర్ జీవీ కోటేశ్వరి, వీఆర్‌వో, ఏఎన్ఎంలు సుమన్‌బాబు కుటుంబ సభ్యులకు అందించారు. వలంటీర్లు ప్రభుత్వ పథకాలు గడపగడపకూ అందించడంతో పాటు, తోటి వలంటీర్ కష్టాల్లో ఉంటే ఆదుకునే సహృదయం ఉందని చాటుకున్నారు.

ఓటీపీ అడిగితే చెప్పవద్దు

బిక్కవోలు: మీకు అమ్మఒడి వచ్చిందని, రైతు భరోసా డబ్బులు పడ్డాయనీ.. ఇంకా విద్యాదీవెన, వసతి దీవెన, ఆరోగ్యశ్రీ వంటి పథకాల పేర్లు చెప్పి కొందరు వ్యక్తులు ఫోన్లు చేసి ఓటీపీ అడిగితే చెప్పవద్దని బిక్కవోలు ఎస్సై పి.బుజ్జిబాబు సూచించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల పేర్లతో కొంతమంది సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. పథకాల పేర్లతో ఫోన్లు చేసి ఓటీపీలు అడిగి వారి బ్యాంకు ఖాతాల్లో సొమ్ములు కాజేస్తున్నారని తెలిపారు. ఇలాంటి ఫోన్లపై అప్రమత్తంగా ఉండాలని ఎస్సై హెచ్చరించారు. ప్రభుత్వ పథకాల గురించి అధికారులు ఎప్పుడూ ఫోన్లు చేయరని, బ్యాంకు ఖాతా వివరాలు, పాస్‌వర్డులు, ఓటీపీలను గోప్యంగా ఉంచుకోవాలని సూచించారు.

చీకటి జీవితంలో ఆశల వెలుగు

- బాధితులకు అండగా డీఅడిక్షన్ సెంటర్
- గడిచిన పదేళ్లలో 2 వేల మందికి చికిత్స



సెంటర్‌లో కౌన్సెలింగ్ ఇస్తున్న దృశ్యం



ధవళేశ్వరంలోని డీఅడిక్షన్ సెంటర్

ధవళేశ్వరం: దురలవాట్ల బారిన పడి, వాటికి బానిసలైన వారికి కొత్త జీవితాన్ని అందించడం కోసం ఏర్పాటైన డీఅడిక్షన్ సెంటర్ పలువురు జీవితాల్లో వెలుగులు నింపుతోంది. వ్యసనాలకు బానిసలై కుటుంబాలను చీకటిలోకి నెడుతున్న అనేక మందికి కౌన్సెలింగ్, చికిత్స అందిస్తూ వారిని సాధారణ జీవితంలోకి వచ్చేలా కృషి చేస్తోంది. దవళేశ్వరంలోని పుష్కరమాత కాన్వెంట్ కమిటీ న్యూలైఫ్ డీఅడిక్షన్ సెంటర్ ఇలా విలువైన సేవలు అందిస్తోంది. గడిచిన పదేళ్లల్లో సుమారు 2 వేల మందికి చికిత్స, కౌన్సెలింగ్ అందించింది. మద్యం, మత్తు పదార్థాలకు బానిసైన వారిని గుర్తించి ప్రతినెలా సుమారు 15 నుంచి 20 మందికి ఇక్కడ చికిత్స అందిస్తున్నారు.

అవగాహన సదస్సులు

దురలవాట్లకు గురి కాకుండా ప్రజలను చైతన్య పరిచే విధంగా ఈ కేంద్రం ద్వారా అనేక సదస్సులను నిర్వహిస్తున్నారు. చెడు అలవాట్ల నుంచి ఏవిధంగా బయటపడాలో అవగాహన కల్పిస్తున్నారు. గంజాయి, మత్తు పదార్థాలకు బానిసవుతున్న యువతను గుర్తించి వారికి కౌన్సెలింగ్ ఇస్తున్నారు. మత్తు పదార్థాల వినియోగం ద్వారా కలిగే అనారోగ్య సమస్యలను వివరిస్తూ, వాటి నుంచి దూరం చేసేందుకు కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా అనేక చోట్ల అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేసి చిన్న వయసులో చెడు అలవాట్ల బారిన పడిన వారిని గుర్తిస్తున్నారు.

సాధారణ జీవితం



డీఅడిక్షన్ సెంటర్ ద్వారా ఇప్పటికి సుమారు 2 వేల మందికి సేవలందించాం. ప్రతి ఒక్కరికి నెల రోజుల పాటు చికిత్సతో పాటు కౌన్సెలింగ్ ఇస్తున్నాం. ఇక్కడ చికిత్స పొందిన వారిలో సుమారు 80 శాతం మంది వ్యసనాలకు దూరమై కుటుంబాలతో కలిసి నేడు సంతోషంగా సాధారణ జీవితం గడుపుతున్నారు.

– డాక్టర్ పులిదిండి సుందరరాజు, డైరెక్టర్, డీఅడిక్షన్ సెంటర్

సినిమాలు

శ్యామల	: మహావీరుడు
సూర్యమినీ	: మిషన్ ఇంపాజిబుల్
సూర్యప్యాలెస్	: బేబీ
స్వామి	: మహావీరుడు
అశోక	: రంగబలి
శివజ్యోతి	: సామజవరగమన
అనుశ్రీ	: ఆదిపురుష్
రాజా	: బేబీ
ఊర్వశి	: నాయకుడు
రంభ	: రివెంజ్, రుద్రంగి
మేనక	: మిషన్ ఇంపాజిబుల్
అప్సర	: బేబీ
నామవరం	
వీఎస్ మహల్	: బేబీ
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: బేబీ
కడియం	
వెంకటసూర్య	: మహావీరుడు

పెరిగిన గోదావరి నీటిమట్టం



ములకల్లంక, బొబ్బిల్లంక మధ్య గోదావరిలో వేసిన రోడ్డుపై నీరు

సీతానగరం: గోదావరి నీటిమట్టం పెరగడంతో మండలంలోని ములకల్లంక, బొబ్బిల్లంక గ్రామాల మధ్య ఆదివారం ఉదయం రాకపోకలు బంద్ అయ్యాయి. ఈ రెండు గ్రామాల మధ్య నదిలో నిర్మించిన రోడ్డు కొంతమేర మునిగిపోయింది. అయితే సాయంత్రానికి ఉధృతి స్వల్పంగా తగ్గడంతో ఆ దారిలోనే స్థానికులు రాకపోకలు ప్రారంభించారు. ఏటా గోదావరి వరద తగ్గుముఖం తర్వాత సెప్టెంబర్, అక్టోబర్‌లలో ఈ రోడ్డును పంచాయతీ అధికారులు ఏర్పాటు చేస్తారు. ములకల్లంక వాసులు బయట గ్రామాలకు, అలాగే బొబ్బిల్లంక రైతులకు చెందిన లంకభూముల పనులకు ఈ రోడ్డు మీదుగానే రాకపోకలు జరుపుతారు. ములకల్లంక గ్రామస్తులకు రెండు మరపడవలు ఉన్నాయి. వరద సమయంలో వీటిపై ప్రయాణిస్తారు.

సారా బట్టీలపై ఎస్ఈబీ దాడులు

గోకవరం: మండలంలోని కృష్ణునిపాలెంలో సారా బట్టీలపై ఆదివారం ఎస్ఈబీ సిబ్బంది దాడి చేశారు. వివరాల్లోకి వెళితే.. కృష్ణునిపాలెం గ్రామ శివారున సారా తయారు చేస్తున్నారనే ముందస్తు సమాచారం మేరకు కోరుకొండ ఎస్ఈబీ ఎస్సై సత్యనారాయణ తన సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో రెండు బైక్‌లు, 25 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. సారా తయారీకి సిద్ధం చేసిన 800 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. రంపయర్రంపాలేనికి చెందిన గందం మరిదయ్య, గందం అర్జు, కేతా ఈశ్వరరావు, ఒరుగళ్ల సూర్యచంద్రంలను అదుపులోకి తీసుకున్నట్టు ఎస్సై సత్యానారాయణ వివరించారు.